బర్డ్‌ఫ్లూపై టెన్షన్ వద్దు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కరోనా వైరస్‌తో మొన్నటి వరకు అతలాకుతలమైన జనం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మరోసారి బర్డ్‌ఫ్లూ భయపెడుతోంది. కొన్ని రోజులుగా కేరళను వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే బర్డ్‌ఫ్లూపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యనిపుణులు. ఎందుకంటే బర్డ్‌ఫ్లూకు పాండమిక్ కెపాసిటి అనేది చాలా తక్కువగా ఉండటం వల్ల అది దూర ప్రాంతాలకు వ్యాప్తి చెందే అవకాశాలు పెద్దగా ఉండకపోవచ్చంటున్నారు. పక్షులు, కోళ్ల నుంచి వ్యాప్తి చెందే ఈ వైరస్ మనుషులపై తీవ్రంగా ప్రభావం చూపిన దాఖలాలు పెద్దగా లేవంటున్నారు నిపుణులు. ప్రస్తుతం దేశంలో కేరళ మినహా ఇతర ఏ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ కేసులు పెద్దగా నమోదు కాలేదంటున్నారు వైద్యులు.

లక్షణాలు: జలుబు, దగ్గు, తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు

బర్డ్ ఫ్లూపై భయం అవసరం లేదు..

బర్డ్‌ఫ్లూ గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బర్డ్‌ఫ్లూకి పాండమిక్ సామర్థ్యం చాలా తక్కువ. అయితే అది ఎపిడమిక్ అయ్యే అవకాశాలున్నాయి. వైరస్ మూడు రకాలుగా ఉంటుంది. అందులో కొన్ని ఎండమిక్, కొన్ని పాండమిక్, మరికొన్ని ఎపిడమిక్ ఉంటాయి. ఎపిడమిక్ అంటే ఒక జిల్లాలో వైరస్ సోకితే అది చుట్టుపక్కల జిల్లాలకు వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అంతేకాని ఖండాంతరాలు, దేశాలు దాటి వ్యాపించే అవకాశాలు అతి తక్కువ అని చెప్పవచ్చు. కరోనా వైరస్ విషయానికొస్తే గతంలో కూడా కరోనా ఉంది. కాని అది పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే వైరస్‌లో మ్యుటేషన్‌లు రావడం వల్ల కొత్త రకమైన కరోనా వైరస్‌లు పుట్టుకొచ్చి, పాండమిక్‌గా మారింది. అలాగే బర్డ్‌ఫ్లూలో కూడా ప్రస్తుతం ఎపిడమిక్ మాత్రమే అయ్యే అవకాశాలున్నాయి. ఒకవేల బర్డ్‌ఫ్లూలో వైరస్ మ్యుటేషన్‌లు చెంది, కొత్త రకమైన బర్డ్‌ఫ్లూ వైరస్‌లు పుట్టుకొస్తే మాత్రమే పాండమిక్ వచ్చే అవకాశాలుంటాయి. ప్రస్తుతానికి అలాంటి పరిస్థితులేవీ కనిపించడం లేదు. అందుకని ప్రజలు బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ దవాఖాన

వైరస్ ఎపిడమిక్ కావచ్చు..

- పాండమిక్ అయ్యే అవకాశాలు తక్కువ
- గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదు..

బర్డ్‌ఫ్లూ వైరస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదు. కరోనా చికిత్స తరహాలోనే సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరుగుతుంది. జ్వరం ఉంటే జ్వరానికి, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే ఆ లక్షణాల ఆధారంగానే చికిత్స చేయాలి.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

- ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడానికి పలు విద్యాసంస్థల్లో, పలు వీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ ఆదేశాల మేరకు ర్యాలీలు, అవగాహన సమావేశాలు ముమ్మరంగా చేపడుతున్నారు. ముఖ్యంగా రెసిడెన్షియల్ అసోసియేషన్, స్వయం సహాయక సంఘాల మహిళలు స్లమ్, టౌన్ ఫెడరేషన్ సమావేశాలు ఏర్పాటు చేసి వారికి ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు ఓటర్ల బాధ్యతను తెలియజేయడం, ఓటు తప్పనిసరిగా వేయాలని... ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ద్వారా చిరు వ్యాపారులు, వివిధ కమ్యూనిటీ పెద్దలకు, యువతకు పూర్తి స్థాయిలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరుందో లేదో మరొకసారి, అలాగే మీ పోలింగ్ బూత్‌ను కూడా చెక్ చేసుకోవాలని ఈ ఓటరు చైతన్య కార్యక్రమంలో వివరిస్తున్నారు.

'పీహెచ్‌డీ' పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ కోర్స్ వర్క్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ, వాటిని 29 నుంచి నిర్వహించాలని తాజాగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను www.osmania.ac.inలో చూసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: కాకతీయ ఐఏఎస్ అకాడమీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత శిక్షణను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు తెలిపారు. అకాడమీ డైరెక్టర్, ప్రముఖ పోటీ పరీక్షల నిపుణుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో 50 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారని చెప్పారు. దీనికి సంబంధించిన తరగతులు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని, వివరాలకు 9160 571483, 9182 3998 58 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'రీసెర్చ్ మెథడాలజీ'పై వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో 'రీసెర్చ్ మెథడాలజీ'పై సోమవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. పీజీ నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఉద్దేశించిన ఈ వర్క్‌షాప్‌ను పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ రమేశ్ హాజరై మాట్లాడారు. ప్రామాణికమైన, వాస్తవికమైన ప్రాజెక్ట్ నివేదికలను తయారు చేయడం ఎంతో కీలకమని, దీని కోసం విద్యార్థులు శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ గంగాధర్, విభాగం హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ కవితాదేవి, ప్రొఫెసర్లు నరేశ్‌రెడ్డి, శేఖర్, సంధ్యారాణి, జి. శ్రీనివాసరావు, నాజియా సుల్తానా పాల్గొన్నారు.

ఫైర్, సేఫ్టీ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కాచిగూడ, ఏప్రిల్ 22 : నేషనల్ సెంటర్ ఫర్ సేఫ్టీ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఫైర్, సేఫ్టీ కోర్సులకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకటేర్డి తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల యువకులు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 6302 3558 72లో సంప్రదించాలని కోరారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 22: సమష్టి కృషితో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు చేసి మరింత పేరు తెచ్చేలా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వెంకటరమణ సూచించారు. సోమవారం వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ ఏడాది కార్యాచరణ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ, పర్యావరణ పరిరక్షణ , రైతుల లాభదాయకత, ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుదల తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించి నూతన వంగడాలను రూపొందించాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు (2024-25) వ్యవసాయ పరిశోధనలలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను చర్చించి ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, పరిశోధనా విభాగాల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

చేవెళ్ల టౌన్, ఏప్రిల్ 22: ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణంలోని ఆయన విగ్రహానికి, మండలంలోని కౌకుంట్ల గ్రామంలోని ఆయన సమాధి వద్ద సబితా ఇంద్రారెడ్డి, కుమారులు కార్తిక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఇంద్రన్న కల అని, రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ నేతృత్వంలో సుపరిపాలన కొనసాగిందన్నారు.

శిక్షణ పూర్తి చేసుకుని గౌరవం పొందాలి

చెలాపురా ట్రైనింగ్ సెంటర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న ఐపీఎస్ అధికారి వి.సత్యనారాయణ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 22: ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన కానిస్టేబుల్స్ అంకితభావంతో శిక్షణ పొందాలని ఐపీఎస్ అధికారులు అభిలాష బిస్త్, వి.సత్యనారాయణ అన్నారు. సోమవారం సైబరాబాద్, రాచకొండ, నిజామాబాద్, సిద్ధిపేట్, నల్గొండకు చెందిన కొత్తగా ఎంపికైన 297 మంది ట్రైనింగ్ (మహిళ)కానిస్టేబుల్స్‌కు శిక్షణనిచ్చేందుకు చెలాపూరా ట్రైనింగ్ సెంటర్‌లో ఎం.బాపూరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐపీఎస్ అధికారులు అభిలాష బస్త్,వి.సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ట్రైనింగ్ సెంటర్‌లో నిబంధనలు పాటించి క్రమ శిక్షణగా ప్రతి విషయాన్ని పరిశీలించాలన్నారు. పోలీస్ ఉద్యోగం అంటే ప్రజలకు శాంతిభద్రతలను అందిస్తూ ..వారి ఆస్తులకు రక్షణగా నిలవడమేనని తెలిపారు. తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన అనంతరం పూర్తిస్థాయి పోలీసులుగా సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కళ్యాణం.. కమనీయం

మొయినాబాద్, ఏప్రిల్ 22: చిలుకూరు బాలాజీ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవీ కళ్యాణం అర్ధరాత్రి 2 గంటల వరకు కన్నుల పండువగా జరిగింది. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముందు వేంకటేశ్వరస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవాలయం సమీపంలోని మండపంలో వేంచేయించారు. అలాగే అమ్మవార్లను ఊరేగింపుగా స్వామివారి చెంతకు తీసుకెళ్లి ఎదురుకోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ గర్భగుడి వెనకభాగంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో ఆశీనులను చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలను గ్రామ పంచాయతీ సమర్పించింది. ఈ మహోత్సవంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు సీఎస్ రంగరాజన్, పరవస్తు రామాచారి, తిరుమల కిరణాచారి, నర్సింహన్, కన్నస్వామి, టట్టు స్వామి, అనిల్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి విజయ యాత్ర

- కర్మన్‌ఘాట్ వయా కోఠి టూ తాడ్‌బన్ వరకు ర్యాలీ
- ఉదయం 11.30 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): నేడు నగరంలో జరిగే హనుమాన్ జయంతి విజయయాత్ర సందర్భంగా ఉదయం 11.30 గంటల నుంచి ర్యాలీ పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సికింద్రాబాద్ తాడ్‌బన్ హనుమాన్ ఆలయం వరకు 12 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. ఈ ర్యాలీ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై మరో ర్యాలీ చంపాపేట్, ఐఎస్ సదన్, దోబీ ఘాట్, సైదాబాద్ వై జంక్షన్, శంకేశ్వర్‌బజార్ నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ట్యాంక్ అక్కడి నుంచి దిల్‌సుఖ్‌నగర్ తిరిగి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి దిల్‌సుఖ్‌నగర్ మీదుగా మూసారాంబాగ్, నల్గొండ క్రాస్‌రోడ్స్, చాదర్‌ఘాట్ నుంచి కోఠిలోని గౌలిగూడ నుంచి వచ్చే ప్రధాన ర్యాలీకి కలుస్తుందని చెప్పారు. సుమారు 10.8 కిలోమీటర్లు ఈ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ర్యాలీల సందర్భంగా గౌలిగూడ నుంచి బయలుదేరే ర్యాలీ పుత్లీబౌలి, కోఠి ఆంధ్రాబ్యాంకు, కోఠి డీఎం అండ్ హెచ్ ఎస్(కర్మన్‌ఘాట్ నుంచి వచ్చే ర్యాలీ ఇక్కడే కలుస్తుంది), సుల్తాన్‌బజార్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, గాంధీనగర్, వైస్రాయ్ హోటల్ వెనుక నుంచి ప్రాగా టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట్ రోడ్డు, బైబిల్ హౌస్, సిటీలైట్ హోటల్, బాటా షోరూం, ఉజ్జయినీ మహంకాళీ టెంపుల్, రాంగోపాల్‌పేట్ పీఎస్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీఓ జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపీరియల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ వద్ద ఎడమ వైపు తీసుకొని తాడ్‌బన్ హనుమాన్ ఆలయానికి చేరుకుంటుందన్నారు. దాదాపు 21కిలోమీటర్ల మేర కర్మన్‌ఘాట్ నుంచి తాడ్‌బన్ వరకు ఈ ర్యాలీలు సాగుతాయని, రాత్రి 8 గంటల వరకు ఈ ర్యాలీ పూర్తయ్యే అవకాశాలున్నాయని వెల్లడించారు. ర్యాలీలు వెళ్లే సమయంలో ఆయా కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. వాహనదారులు మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సీపీ సూచించారు. ఇదిలా ఉండగా హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆయా పోలీస్ కమిషనర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా

రిలే స్విమ్మింగ్‌కు ఎంపికైన క్వీన్ విక్టోరియా

కాచిగూడ, ఏప్రిల్ 22:

స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలంక నుంచి ధనుస్కోటి వరకు రిలే స్విమ్మింగ్‌కు బర్కత్‌పుర ప్రాంతానికి స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా ఎంపికైంది. భారత్ నుంచి ఆరు మంది ఎంపిక కాగా అందులో తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన క్వీన్ విక్టోరియా శ్రీలంక నుంచి ధనుస్కోటి వరకు 33 కిలోమీటర్లు బంగాళాఖాతంలో ఈదనున్నారు. నేటి నుంచి రిలే స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. పోటీల్లో పాల్గొనడానికి సోమవారం రాత్రి శ్రీలంకకు బయలుదేరి వెళ్లారు. క్వీన్ విక్టోరియా రిలే స్విమ్మింగ్‌కు ఎంపిక కావడంతో క్రీడా శాఖ మంత్రి, పలువురు ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

జేఎన్‌టీయూహెచ్‌లో టెక్నికల్ ఫెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22 : వర్సిటీలో నేర్చుకున్న పరిజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని, నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ కట్టా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం వర్సిటీ జేఎన్ ఆడిటోరియంలో టెక్నికల్ ఫెస్ట్ 2024 ప్రారంభోత్సవంలో వీసీ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటనర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నైపుణ్యం ఉంటే మంచి అవకాశాలు వస్తాయని, ఉద్యోగాలు పొందడమే కాదు.. సృష్టించేలా ఎదగాలన్నారు. యేడాదిలో నేర్చుకున్న పరిజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు చేపడితే.. ఆ ప్రదర్శనలు సమాజానికి తెలుస్తాయని, వాటితో విద్యార్థుల భవిష్యత్ మారిపోతుందన్నారు. టెక్‌ఫెస్ట్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

సెల్ఫ్ క్లోజ్డ్ ఫ్లడ్ బేరియర్ నమూనాతో విద్యార్థులు సాంకేత్, వేణు, నవీన్, విజయ్‌రాజ్ తదితరులు

జీఎస్ఐలో శిక్షణ కార్యశాల ప్రారంభం

జీఎస్ఐలో శిక్షణ కార్యశాలను ప్రారంభిస్తున్న కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా తదితరులు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22: అరుదైన, వ్యూహాత్మకమైన ఖనిజాల అన్వేషణపై జీఎస్ఐ శిక్షణ సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యశాలను కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా, డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాథ్యు జోసెఫ్, డైరెక్టర్ వివేక్ కుమార్ శర్మతో కలిసి సోమవారం ప్రారంభించారు. నేషనల్ జియోసైన్స్ డేటా రిపోజిటరీ పోర్టల్, కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం అన్వేషణ, ఆధునిక సాంకేతికత అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సంజయ్ లోహియా మాట్లాడుతూ... తొలి రోజు నిర్వహించిన నేషనల్ జియోసైన్స్ డేటా రిపోజిటరీ శిక్షణలో ప్రాజెక్ట్ ప్రతిపాదనల రూపకల్పనలో సైంటిస్టుల సమస్యలపై ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ మాథ్యుజోసెఫ్, పీఆర్ఓ డాక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర గనుల మంత్రిత్వ శాఖలు, ప్రైవేటు నోటిఫైడ్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల నుంచి 64 మంది భూ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సగర మహాసభ ఎన్నికలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 22: ట్విన్ సిటీస్ అఖిల భారత సగర మహాసభ ఎన్నికలు పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా సజావుగా నిర్వహించి ఎన్నుకున్నామని అఖిల భారత సగర మహాసభ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సాగర్ స్పష్టం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్విన్ సిటీస్ అఖిల భారత సగర మహాసభ నూతన కార్యవర్గ సభ్యులు కొండల్ అనిల్‌కుమార్‌సాగర్, కమటం వేణుగోపాల్ సాగర్, శ్రీధర్, జన్మోహన్‌రావు, రాజశేఖర్‌రావుతో కలిసి హరికిషన్ సాగర్ మాట్లాడారు. కొందరు కావాలనే ఎన్నికలు సజావుగా జరగలేదని నూతన కార్యవర్గంపై దుష్ప్రచారం చేస్తున్నారని , అటువంటి పుకార్లను ఎవరూ నమ్మొద్దని సూచించారు. దుష్ప్రచారం చేసే వారిపై లీగల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివాదం చేస్తున్న అఖిల భారత సగర మహాసభ ప్రతినిధులు

108 సిబ్బందికి అవార్డులు

అత్యవసర సేవలు అందించిన 108 సిబ్బందికి రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డును సోమవారం జీవీకె ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ హెడ్ ఎంఏ ఖలీద్, డైరెక్టర్ వెంకటేశం అందజేశారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన ఈఎంటీ సత్యనారాయణ, పైలట్ ఆంజనేయులు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. – మెహిదీపట్నం

ధరిత్రి పరిరక్షణతోనే మానవ మనుగడ

అబిడ్స్, ఏప్రిల్ 22: కాలుష్యం బారి నుంచి నేల తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ జియోగ్రఫీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ అశోక్ కుమార్ లోనావత్ హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలు అణుబాంబు కంటే ప్రమాదకరమని, మానవ మనుగడ ధరిత్రి పరిరక్షణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. భూమి అంటే మట్టి మాత్రమే కాదని, భూమి అంటే 84 లక్షల జీవరాసుల సముదాయమని, మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా దానికి ఆధారం భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు అనే పంచ భూతాల వల్ల మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఓయూ జియోగ్రఫీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అఖ్తర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాతబస్తీ టీసీసీ అధ్యక్షుడు ఎస్ రామకృష్ణ శాస్త్రి, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జీఎం కస్తూరి, వి.సరిత, డాక్టర్ కె.అనిత, సంఘ సేవకులు బత్తుల హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో పాల్గొన్న ఓయూ జియోగ్రఫీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ అశోక్‌కుమార్ లోనావత్ తదితరులు